# వెన్నెల

గురజాడ శోభాపేరిందేవి

డిసెంబర్ చలి గిలిగింతలు పెడుతుంది.

వెచ్చగా భర్త గుండెల్లో ఒదిగిపోయి పడుకున్న వెన్నెల భర్తని గురించి మత్తుగా ఆలోచించసాగింది. ఎంత మంచివాడో వీరేన్! ఆతను తనకి ఈ పదిహేను రోజుల వైవాహిక జీవితంలో స్వర్గాన్ని చూపించాడు.

అసలు తను తన ఉనికినే మర్చిపోయింది. వీరేన్ శరీరంలోని ఓ భాగంలాగ మాత్రమే తను అనిపిస్తోంది.

వివాహంలో ఇంత మహత్యం ఉందా? లేక పోతే ఇలాంటి మంచి భర్త లభిస్తేనే అలాంటి భావం కలుగుతుందా!

ఏమో!

ఏమైతేనేం తను లక్కీ!

భర్తకి మరీ దగ్గరగా జరిగి అతని చుట్టూ చేతులు వేసింది వెన్నెల.

బయటేదో చప్పడైంది.

ఉలిక్కిపడి కళ్లు విప్పింది.

హనీమూన్ అయిపోయి తాము హైదరాబాద్ తిరిగి వచ్చేసామని ఆ అమ్మాయికి గుర్తొచ్చింది.

అత్తగారింట్లో ఆలస్యంగా లేస్తే బాగుండదు. అతని చుట్టూ వేసిన చేతులు తీసేసింది.

గబుక్కున లేవబోయింది.

"ఊహూ. ఇప్పడే లేవద్దు" ఆమె బుగ్గ మీద పెదవిని అలాగే అన్చి అన్నాడు వీరేన్.

"మీ అమ్మగారూ వాళ్లూ ఇంత ఆలస్యంగా లేస్తే ఏమైనా అనుకుంటారు."

"అవును ఎంతో ఇదిగా అనుకుంటారు."

"అందుకే మిమ్మల్ని వదలమన్నాను"

మరింత గట్టిగా బంధించి ఉక్కిరి బిక్కిరి చేసాడు వీరేన్.

"వదలమంటే ఇంకా గట్టిగా పట్టుకుంటారేమిటి?"

"వదలమన్నావా? వదులుగా ఉంది ఇంకాస్త బిగించు! అప్పడే నాకు సుఖంగా ఉంటుంది అంటున్నావేమో అనుకున్నాను"

"ఛీ పో"

"అయితే వదిలేయమంటావా?"

"అవును"

"ఇంకొక్కసారి"

"వద్దు వద్దు"

వీరేన్ ఆమె మాట వినిపించుకోలేదు.

అందుకే బారెడు ప్రొద్దెక్కాక బెడ్ దిగి బాత్రూమ్‌లోకి నడిచింది వెన్నెల.

షవర్ కింద నిలబడింది. భర్త పెట్టే గిలిగింతల ముందు ఆ చల్లటి నీటి తుంపరలు సరిపోవనిపించింది.

చక్కగా ముస్తాబై బయటకి వచ్చింది.

"రామ్మ రా!" ఆప్యాయంగా పిలిచింది అత్తగారు.

"ఇవాళ పదహారు రోజుల పండగ కదా! కొత్త చీర కట్టుకో! గుడికి వెళ్ళి రండి. మళ్లీ పెళ్లిరోజు లాగ పిండివంటలతో భోజనం చేద్దాం" అంది.

వెన్నెలకి ఎందుకో వీక్‌గా అనిపించసాగింది.

"బహుశా నిద్ర సరిగ్గా పోకపోవడం వల్లేమో!"

"కొత్తగా పెళ్లైన కోడెవయసు జంట కొన్నాళ్లవరకైనా నిదురే పోరాదంట!" పాత సినిమా పాట గుర్తొచ్చింది.

అందంగా తయారై భర్తతో గుడికి వెళ్లింది.

గుళ్ళో పులిహోర పెట్టారు.

వెన్నెలకి అది చాలా నచ్చింది.

"అంత ఇష్టంగా ఎలా తింటున్నావ్ వెన్నెలా? పులుపు బాగా ఎక్కువప్పలేదూ!"

"లేదే!"

"లేదా?" ఆశ్చర్యపోయాడు వీరేన్. కానీ ఆ విషయాన్నింక పొడిగించలేదు.

విడి విడిగా ఉన్న రెండు పసుపు తాళ్లనీ అంటి పెట్టుకుని ఉన్న మంగళ సూత్రాలను ఒక గొలుసులో చేర్చి ఇచ్చింది అత్తగారు.

గొలుసును మెడలో వేసుకుంది వెన్నెల.

విడి విడిగా ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని పూర్తిగా ఒకటిగా చేసేందుకు ఇన్ని రోజులు పడతాయేమో! అందుకే పదహారు రోజుల పండగనాడే సూత్రాలు గొలుసులో చేరుస్తారు అనుకుంది వెన్నెల.

తీపి పిండి వంటలను చూస్తే కడుపులో తిప్పినట్టు అనిపించసాగింది.

"అదేంటి వెన్నెల ఒక్క స్వీటూ తినడం లేదేం? నీకు నెయ్యితో చేసిన మైసూర్‌పాక్ అంటే ఇష్టం అన్నావు కదా!"

"అవును కానీ!"

"కానీ లేదూ ఓణీ లేదు ఇది తిని తీరాలి" అందరూ ఉన్నారనైనా లేకుండా వెన్నెల నోట్లో పెట్టేసాడు.

"తిను తిను మొత్తం తినాలి"

భర్త బలవంతంతో సగం తింది. కానీ విపరీతంగా కడుపులో తిప్పసాగింది. ఇంక తట్టుకోలేక పరుగునా వెళ్లి వాష్ బేసిన్‌లో వాంతి చేసుకుంది.

కొత్త మనుష్యులందరి ముందూ అలా చెయ్యడం ఇబ్బంది అనిపించింది కానీ ఆపుకోలేకపోయింది.

ఆ రోజంతా డల్‌గా చికాగ్గా ఉంది.

"ఏమైంది వెన్నెలా?"

"ఏమో! చాలా నీరసంగా అనిపిస్తోంది. పడుకోవాలనుంది.

"రాత్రంతా జాగరణ చేయిస్తే ఆ పిల్ల తట్టుకోగలదట్రా? అసలే ఎంత నాజూగ్గా ఉందో చూడు" అంది అత్తగారు.

వీరేన్ ముఖం ఎర్రబడింది.

వెన్నెల ఆరోజు మధ్యాహ్నం పుట్టింటికెళ్లింది.


తల్లి ఏం తినమన్నా వద్దంది. తల్లి బలవంతం మీద కాపీ తాగి డోక్కుంది.

వెంటనే వెన్నెల తల్లి తన ఇంట్లో అద్దెకి ఉంటున్న నర్స్‌ని పిలిచి పరీక్ష చేయించింది.

"మీ అమ్మాయి ప్రెగ్నెంట్" అంది నర్స్.

పెళ్లై నెల కాలేదు. అప్పడే కడుపెలా వస్తుందమ్మా? అందుకే ఈ కాలం వాళ్లని నమ్మబుద్ధి కాదు నాకు. అదే మంత్రసాని అయితే ముఖం చూసి చెప్పేస్తుంది. నువ్వైతే నర్సింగ్ కోర్స్ చేశావు ఏం లాభం?

తన మాటని అలా తీసేసారన్న కోపం ఓ పక్కన అది నిజం అన్న నమ్మకం మరో పక్కన కలిగింది నర్స్‌కి.




"మీరు ఏ పెద్ద డాక్టర్‌కైనా చూపించండి. ఎవ్వరు పరీక్షించినా ఇదే మాట చెప్పి తీర్తారు. అంది నర్స్.

వెన్నెల తల్లికి గుండె దడ దడ లాడింది.

వెన్నెలని గదిలోకి తీసుకువెళ్ళి తలుపు మూసింది.

"రాజుతో వ్యవహారం ఇక్కడిదాకా వచ్చిందిటే" అంది గుసగుసగా!

"ఏంటమ్మా?" అయోమయంగా అడిగింది వెన్నెల.

"రాజు నిన్ను ప్రేమిస్తున్నాను అంటూ నీ వెంట పడేవాడు కదే! ముక్కూ ముఖం తెలీని వాడిని చేసుకునే కంటే క్లాస్‌మేట్‌ని చేసుకోడం నయం కదా అన్నావు కూడా!

అతను యూనివర్సిటీలో నీ వెంట తిరగడమే కాక ఇంటికీ వచ్చాడు కూడా కదా!

కులం కాని వాడిని చేసుకోవద్దు అంటూ నేను గోల చేసి అన్నం నీళ్లు మానేస్తానని నువ్వు అతన్ని చేసుకోనని ఇంక అతని ముఖం చూడనని మాటిచ్చావు"

"ఇవ్వడవన్నీ ఎందుకమ్మా?"

"నువ్వు నెల తప్పావని తెలిసి కూడా ఇవ్వడవన్నీ అనవసరం అనుకోవాలా?"

నిర్ఘాంతపోయింది వెన్నెల.

"రాజుతో నేను సన్నిహితంగా ఎవ్వడూ వ్యవహరించలేదమ్మా! ప్రామిస్!

"మరైతే కడుపెలా వచ్చిందే?!"

"అదే నాకు అర్థం కావడం లేదమ్మా"!

"నేను నీ మాట నమ్మలేకపోతున్నాను వెన్నెలా! ఏది ఏమైతే ఏం నీకు అబార్షన్ చేయించడం నా ప్రథమ కర్తవ్యం! ఈ విషయం మూడో కంటివాడికి తెలియకూడదు."

"?!"

"ఇంకేం మాట్లాడకు" అంది తల్లి.

వెన్నెలకి గుట్టు చప్పడు కాకుండా అబార్షన్ చేయించారు.

వెన్నెల కోసం వచ్చిన వీరేన్‌కి ఆమె ఎక్కడికెళ్ళిందో అర్థం కాలేదు. వెన్నెలా వాళ్ళ వాళ్ళంతా తలో మాటా చెప్పారు.

"అంత రహస్యంగా తల్లితో కలిసి ఆమె ఎటు వెళ్ళి ఉంటుందో అతనికి అర్థం కాలేదు.

వెన్నెల వదిన ఇచ్చిన టిఫిన్ తింటూ మౌనంగా కూర్చున్నాడు.

వెన్నెల అన్న కొడుకు వీరేన్ చుట్టూ తిరిగి ఆడుకోసాగాడు.

ఆ అబ్బాయితో ఈ మాటా ఆ మాటా మాట్లాడుతున్నాడే కానీ ఈ లోకంలో లేడతను.

"అయితే అత్త ఆసుపత్రి నుండి వచ్చేదాకా కూర్చుంటారా మామయ్యా! కానీ అత్త బాగా లేట్‌గా వస్తుందిటగా" అన్నాడు.

అంతే! వీరేన్‌కి క్లూ దొరికింది.

విషయం చెప్పేదాకా వెన్నెల వదినని అతను వదిలిపెట్టలేదు.

"ఎందుకు వెళ్ళారో నాకు తెలీదు కానీ ఆసుపత్రికైతే వెళ్ళారు" అందామె.

ఆ ఆసుపత్రి పేరు కనుక్కుని నేరుగా అటే వెళ్ళాడు వీరేన్. రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాడు వెన్నెలని.

విషయం పూర్తిగా విన్న వీరేన్‌కి వెర్రి ఆవేశం వచ్చింది.

ఇంక నీకు నాకూ సంబంధం లేదని చెప్పేసి మరో మాటకి అవకాశం లేకుండా వెళ్ళిపోయాడు.

వెన్నెల జీవితంలోంచి వెన్నెల వెళ్ళిపోయింది. అన్ని రాత్రులూ ఆమెకి అమావాస్యల్లాగానే ఉన్నాయి.

కాలేజీలో లెక్చరర్‌గా చేరింది.

ఓ పక్కన విద్యార్థినులు, మరో పక్క ఎంఫిల్ చెయ్యడంతో బాగా బిజీ అయిపోయింది.

వీరేన్ దగ్గరకి వెళ్దామని తల్లిదండ్రులెన్నో సార్లన్నారు.

"అలా చేస్తే నేను చావడం ఖాయం" అని సీరియస్‌గా చెప్పేసింది.

"వీరేన్‌కి మళ్ళీ పెళ్ళి చేస్తారటే" కంగారుగా అంది ఓరోజు తల్లి.

"చెయ్యనీ!"

"అలా వీల్లేదు"

వెన్నెల మాట్లాడలేదు. ఆ విషయం ఇంక చర్చించకుండా లైబ్రరీకి వెళ్ళిపోయింది.

సమస్య వద్దన్నా మనల్ని వెన్నంటే ఉంటుంది. వేధిస్తుంది. ఇంకా ఇంకా అదే విషయం మాట్లాడితే అది మననే తినేస్తుంది. అందుకే దాన్ని ఎంత దూరంగా ఉంచితే అంత మంచిది అనుకుంటుంది వెన్నెల.

వెన్నెల ఇంటికి వచ్చేసరికి వీరేన్ నిలబడి ఉన్నాడు.

వెన్నెల అతనితో ఏమీ మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"అయామ్ సారీ వెన్నెలా!"

"దేనికి?"

"నిన్ను అనుమానించాను కదా"

"అనుమానించడం, అవమానించడం మీ జన్మహక్కు కదా!"

"అది కాదు వెన్నెలా!"

"ఏది కాదండీ? అండం విడుదలైన తర్వాత స్త్రీ-పురుషులు కలిస్తే గర్భం వచ్చే అవకాశం ఖచ్చితంగా ఉందండి డాక్టర్. స్త్రీ-పురుషులు ఆరో రోజు నుంచి పద్నాలుగో రోజు దాకా కలిస్తే గర్భం వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని డాక్టర్ చెప్పింది.

"కా...నీ"

"సంకోచం వల్లో, కంగారు వల్లో వాళ్ళు సరిగ్గా కలవలేకపోవడం వల్ల మొదటి నెల లోపల గర్భం దాల్చే అవకాశాలు తక్కువ. కానీ ఏ సంకోచం, కంగారు లేకుండా కలిస్తే పదిహేను రోజులకే గర్భం వచ్చి తీర్తుందని ట్విన్ సిటీస్‌లో టాప్ మోస్ట్ గైనకాలజిస్ట్ నాకు బాగా అర్థమయ్యేలాగ వివరించి చెప్పింది".

"నిజం తెల్సినా నువ్వు నాకు చెప్పలేదు. పైగా రహస్యంగా..."

"నో! అందులో రహస్యమేమీ లేదు. అసలే వీక్‌గా ఉన్నాను. అమ్మ భయం చూసి ఏదో ఒకటిలే పనైపోతే చాలు అన్నట్లుండిపోయాను. అయినా మీకు తర్వాత వివరంగా చెప్పేదాన్నే! ముందే చెప్పినా బహుశా ఇలాగే చేసేవాడేమో లెండి!"

వీరేన్ బతిమాలుతున్నాడు.

వెన్నెల వినిపించుకోవడం లేదు. అతను నిరాశగా వెళ్ళిపోయాడు.

వెన్నెల తల్లి కంగారుపడలేదు. ఇటు వీరేన్‌కు కానీ అటు వెన్నెలకి కానీ ఏదో నచ్చచెప్పే ప్రయత్నమూ చెయ్యలేదు.

వివాహబంధం విశిష్టమైనదని ఆమె ప్రగాఢ విశ్వాసం!

విషయం తెలిసింది కనుక వీరేన్ క్షమించేదాకా వెన్నెలని వదలడు.

క్షమ, సహనం పుట్టాకే స్త్రీ పుట్టింది! సో వెన్నెల ఇవాళ కాకపోతే రేపైనా వీరేన్‌కి క్షమించి తీర్తుంది.

ఆ రేపు కోసం ఎదురు చూడడమే మానవమాత్రురాలినైన నా పని అనుకుంది వెన్నెల తల్లి.

వాళ్ళ జీవితాల్లోకి త్వరలో వెన్నెల రావాలని కోరుకుందాం!

## అమితాబ్ అలక

'బడేమియా ఛోటేమియా' సినిమా అభినందన సభకి వెళ్ళిన అమితాబ్ బచ్చన్, గోవిందాల మధ్య చిన్న ఈగో ప్రాబ్లమ్ మొదలయ్యింది. అది శేఖర్ కపూర్ సన్మాన సభలో అందరికీ తెలిసి చిన్న రగడ కూడా అయ్యింది. అయినా పైకి అనే ధైర్యం లేక అందరూ చెవులు కొరుక్కున్నారు. దాంతో అలిగిన అమితాబ్ మళ్ళీ తనంతట తానే మనసు మార్చుకుని గోవిందాకి ఫోన్ చేసి మాట్లాడేసరికి గొడవంతా సద్దుమణిగి పోయిందట.

